సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



రికార్డు స్థాయిలో ఆదాయం
రాఖీ పండుగను పురస్కరించుకొని ఆర్టీసీకి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది.
వివరాలు 8లో ▸



నేటినుంచి ఎండీసీఏ లీగ్
మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ లీగ్ శనివారం నుంచి ప్రారంభం కానుంది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /21.6

వాతావరణం
ఆకాశంలో కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జేపీఎస్‌ల పనితీరుపై పరిశీలన



గండేడ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌లో భాగంగా వారి పనితీరును జిల్లా అధికారులు పరిశీలించారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని జిన్నారం తండా, ఆశిరెడ్డిపల్లి, జంగంరెడ్డిపల్లి, గండేడ్ గ్రామాల్లో డీపీఓ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పర్యటించారు. నాలుగేళ్లలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఎలా ఉంది.. గ్రామాభివృద్ధిలో భాగంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాల ఏర్పాటు, డంపింగ్ యార్డుల నిర్వహణ, మొక్కల పెంపకం తదితర పనుల గురించి ఆరాతీశారు. అలాగే గ్రామ పంచాయతీలకు వెళ్లి రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వీటికి సంబంధించి పలు అంశాల గురించి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. పనితీరు ఆధారంగా ఆయా గ్రామాల్లో కార్యదర్శులు చేసిన పనుల తీరుపై మార్కులు వేసి గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా అధికారుల బృందం పేర్కొంది. కార్యక్రమంలో డీఎస్పీ రామారావు, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ చంద్రయ్య, ఎంపీఈఓ శంకర్‌నాయక్, సర్పంచ్‌లు గోపాల్, హన్మంతు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి విస్తరణ పనులు షురూ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని భూత్పూర్ రోడ్డులో మైత్రీనగర్ వద్ద ఇరుకుగా ఉన్న బ్రిడ్జి విస్తరణ పనులు శుక్రవారం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పెద్ద సిమెంట్ పైపులను ఏర్పాటు చేసి మురుగు నీటిని బయటకు పంపించారు. ఈ పనులతో మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మధ్యలో ఓ భారీ లారీ ఇరుక్కుపోగా.. క్రేన్ల సహాయంతో పక్కకు తప్పించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో కొన్ని గంటలపాటు ఇటు, అటు వాహనాలు బారులుతీరాయి. అలాగే ఈ మార్గంలో వెళ్లే ఆర్టీసీ బస్సులను బైపాస్ ద్వారా మళ్లించారు. ఇతర వాహనాలు శివశక్తినగర్ కమాన్ నుంచి నేరుగా మైత్రీనగర్ మీదుగా తిరిగి భూత్పూర్ రోడ్డుకు చేరుకున్నాయి.

రెండో ఏఎన్‌ఎంలను విస్మరించడం తగదు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖకు పునాదిగా సేవలు అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలను విస్మరిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. రెండో ఏఎన్‌ఎంల నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఏమాత్రం బాగోలేదని, రెగ్యులరైజ్ చేయకుండా నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలు రాయాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. భిక్షాటన చేసి ప్రజల మద్దతు కోరగా.. పలువురు వ్యాపారులు, వాహనదారులు తమకు తోచిన సహాయం అందించారు. రెండో ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా షోకాజ్ నోటీసులివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అభిప్రాయపడ్డారు. రెండో ఏఎన్‌ఎంలు రేణుక, అన్నపూర్ణ, ఎల్లమ్మ, కళమ్మ, పద్మావతి పాల్గొన్నారు.



బదిలీలు.. పదోన్నతులు

ఎట్టకేలకు రేపటి నుంచి ప్రక్రియ ప్రారంభం

- బదిలీల్లో భార్యాభర్తల స్పౌజ్ పాయింట్లకు అవకాశం
- మొత్తం ఖాళీల్లో 500 మందికిపైగా పదోన్నతులు
- అక్రమార్కులతో అసలు వారికి అన్యాయం జరుగుతుందని ఆందోళన
- సీనియార్టీ జాబితాలో తప్పులు లేకుండా చూడాలని సంఘాల డిమాండ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యాశాఖలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. గత జనవరిలో ప్రక్రియను ప్రారంభించి.. ఉపాధ్యాయుల ద్వారా దరఖాస్తులను సైతం స్వీకరించగా ఉపాధ్యాయ సంఘాలకు పాయింట్లు, స్పౌజ్ పాయింట్లు వంటి వాటితో పాటు జీఓ పూర్తిస్థాయిలో స్పష్టత లేదని పలువురు కోర్టులను ఆశ్రయించడంతో స్టే విధించింది. ప్రస్తుతం స్పౌజ్ పాయింట్లకు అనుమతిచ్చి.. ఉపాధ్యాయ సంఘాల పాయింట్లను పెండింగ్‌లో పెట్టింది. దీంతో మరోసారి బదిలీలు, పదోన్నతులకు అవకాశం కల్పించారు. ఈ నెల 3 నుంచి 5 వరకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అయితే 317 జీఓ ద్వారా ఉమ్మడి పాలమూరులోని బదిలీలకు సంబంధించి సీనియార్టీ జాబితాను సిద్ధం చేసే క్రమంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీంతో వాస్తవంగా అర్హులైన దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలు, విడో, స్పౌజ్ వంటి అర్హతలున్న అనేక మందికి అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికారులు గతంలో జరిగిన పొరపాట్లను దృష్టిలో ఉంచుకుని జాబితాలను సిద్ధం చేయాలని పేర్కొంటున్నారు.

జిల్లా, మల్టీ జోన్ స్థాయిలో..

బదిలీలు గతంలో జరిగితే ఉమ్మడి జిల్లాస్థాయిలో జరగగా.. ప్రస్తుతం కొత్త జిల్లాల ప్రకారం చేపడుతున్నారు. వీటి ప్రాతిపదికన చాలామంది పదోన్నతులు రానున్నాయి. మొత్తం ఖాళీల్లో 30:70 రేషియోలో 30 శాతం పదోన్నతులు, 70 శాతం నేరుగా నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి. ఇందులో 350 మందికిపైగా ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందే అవకాశం ఉంది. 85 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా పదోన్నతలు పొందే అవకాశాలు ఉన్నాయి. ఇక జీహెచ్‌ఎంలు మల్టీజోన్ వారీగా రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఎక్కడికైనా బదిలీ కానున్నారు. అయితే ఎంఈఓలను సీనియర్ జీహెచ్‌ఎంల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం వివిధ కారణాలతో వీరిని భర్తీ చేయడం లేదని తెలుస్తుంది. అయితే సాధారణంగా డైట్, బీఈడీ కళాశాలల్లో అధ్యాపకులుగా సీనియర్ స్కూల్ అసిస్టెంట్ల ద్వారా భర్తీ చేయాలి. అయితే వీటిని కూడా చేపట్టకపోవడంతో ఈ కళాశాలల్లో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి.



జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	ఖాళీలు	జనవరిలో ద.చే.
మహబూబ్‌నగర్	876	3,482	479	1,751
నాగర్‌కర్నూల్	845	3,390	450	1,785
వనపర్తి	535	2,023	316	1,212
నారాయణపేట	510	2,020	470	1,060
జోగులాంబ గద్వాల	475	1,971	317	1,285

ద.చే: దరఖాస్తు చేసుకున్నవారు

అర్హులు నష్టపోతారు..



కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అవకతవతలు లేకుండా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి. పైరవీల ద్వారా వచ్చే బదిలీలకు అనుమతి ఇవ్వకూడదు. దీని ద్వారా అసలు అర్హులు నష్టపోతారు. వీటికి అవకాశం ఇస్తే యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం.

– వెంకటేష్, టీఎస్‌యూటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

తప్పుల్లేకుండా చూడాలి..



2015, 2018 స్పౌజ్ పాయింట్లు ఉపయోగించుకున్న దంపతుల ఎస్ఆర్‌లను వెరిఫై చేయాలి. అప్పుడు ఉపయోగించుకుని సర్వీస్ బుక్‌లలో ఎంట్రీ కాని వారు చాలామంది ఉన్నారు. ఎస్ఆర్‌లలో ఎంట్రీ చేయని ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి. జనవరిలో దరఖాస్తు చేసుకున్నవారు స్టేషన్ పాయింట్లు, సర్వీస్ పాయింట్ల కోసం నియామక తేదీలను తప్పుగా నమోదు చేశారు. దీనిని పూర్తిస్థాయిలో పరిశీలించి జాబితాలో తప్పులు లేకండా చూడాలి.

– బాలరాజు, జిల్లా అధ్యక్షుడు, టీపీఆర్టీయూ

ఆదేశాలు రాలేదు..



బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రక్రియ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆదేశాలు వచ్చిన వెంటనే షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అందుకు సిద్ధంగా ఉన్నాం.

– గోవిందరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

3 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈ నెల 3 నుంచి 5 వరకు పదోన్నతులు, బదిలీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించనున్నారు. వచ్చిన దరఖాస్తులను 6, 7 తేదీల్లో విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సీనియార్టీ జాబితాలను అధికారులు విడుదల చేయనున్నారు. అనంతరం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో సీనియార్టీ జాబితాపై ప్రదర్శిస్తారు. 10, 11లో అభ్యంతరాల స్వీకరణ, అనంతరం 12, 13 తేదీల్లో మరోసారి సీనియార్టీ జాబితా విడుదల చేస్తారు. అనంతరం 14న హెచ్‌ఎంలకు జెడ్పీ మేనేజ్‌మెంట్‌లో పనిచేసే వారికి ఆన్‌లైన్‌లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నారు. 15న ఆర్జేడీ స్థాయిలో హెచ్‌ఎంలకు బదిలీలు జరగనున్నాయి.17, 18, 19 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించనున్నారు. 23, 24న స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు, 26, 27, 28న ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. ఈ ప్రక్రియ నెలరోజులు జరగనుంది. మొదట హెచ్‌ఎంలు, తర్వాత స్కూల్ అసిస్టెంట్లు, ఆ తర్వాత ఎస్జీటీల ప్రక్రియ జరగనుంది.

పీయూలో రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పీయూ పరీక్ష కేంద్రాన్ని వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించాలని సూచించారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాల వ్యాల్యుయేషన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

లాఠీచార్జ్ చేయడం దారుణం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేపట్టిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను తక్కువ చూపి భర్తీ చేయడం వల్ల ఎంతో మంది నిరుద్యోగులు నష్టపోతారన్నారు. ఈ నెలలో జిల్లాకేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాల్‌లో రెండురోజులపాటు ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తామని ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, శంకర్, వీరభద్రం, పూజ, రజనీకాంత్, మీశ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులపాటు ఆంక్షలు

మహబూబ్‌నగర్ క్రైం: శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 30 వరకు జిల్లావ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు ఏర్పాటు చేయరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఏమాత్రం చేపట్టరాదని, ఇందుకోసం జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

జడ్చర్లలో ఉద్రిక్తత



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న విశ్వకర్మ మనుమయ సంఘం సభ్యులు

- బ్రహ్మంగారి మఠం విషయమై ముదిరిన వివాదం
- ఒకరి తలకు గాయం, మరొకరికి కత్తిగాట్లు

జడ్చర్ల టౌన్: పట్టణంలో జాతీయ రహదారిపై ఉన్న బ్రహ్మంగారి మఠం వద్ద శుక్రవారం జరిగిన గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బ్రహ్మంగారి మఠానికి సంబంధించిన కమ్యూనిటీ హాల్ వివాదం కోర్టులో కొనసాగుతుంది. అయితే ఈ నెల 17న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని మఠంలో పూజలు చేయాలని విశ్వకర్మ మనుమయ సంఘం తీర్మానించింది. కమ్యూనిటీ హాల్‌లో ఉంటున్న వారు తమను మఠానికి రానివ్వడం లేదని పోలీసులను ఆశ్రయించారు. దీంతో శుక్రవారం ఉదయం సీఐ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ మఠం వద్దకు చేరుకొని కమ్యూనిటీ హాల్‌లో ఉంటున్న వెంకటేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తమకు కోర్టు ఆదేశాలు ఉన్నాయని.. అందుకే ఇక్కడ ఉంటున్నామని వివరించగా పత్రాలు చూపించాలని కోరారు. కాగితాలన్నీ కోర్టులో ఉన్నాయని చెప్పారు. సంఘం సభ్యులు మఠంలో పూజలు నిర్వహిస్తారని.. ఎలాంటి ఆటంకం కలిగించొద్దని సూచించి వెళ్లిపోయారు. సభ్యులు మఠం వద్ద చదును చేస్తుండగా కమ్యూనిటీ హాల్‌లో నివాసం ఉంటున్న వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాన్రాను గొడవ తీవ్రమై కమ్యూనిటీ హాల్‌లో ఉండే వెంకటేశ్, రోహిత్ సభ్యుడు గోపాల్ తలపై కర్రతో బాదడంతోపాటు పక్కనే ఉన్న విష్ణు కడుపులో కత్తెరతో పొడిచారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఏరియా ఆస్పత్రికి, అనంతరం జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన ఇతర సంఘ సభ్యులు కమ్యూనిటీ హాల్‌లో ఉన్న సామగ్రిని తీసి బయట పారేశారు. తమపై దాడి చేశారని బాధితులు, తమ సామగ్రిని బయట పారేశారని రెండోవర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ వివరించారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో..

తమపై దాడి చేసిన వారిని వెంటనే అదుపులోకి తీసుకొని హత్యాయత్నం కేసు నమోదు చేయాలని విశ్వకర్మ మనుమయ సంఘం సభ్యులు ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో కాసేపటికి విరమించారు.

బుజ్జగింపులు షురూ..!

- బీఆర్ఎస్ అసమ్మతులకు పిలుపు
- రంగంలోకి ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు
- నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌తో సంప్రదింపులు
- ఎమ్మెల్సీ కసిరెడ్డితోఫోన్‌లో మాటామంతి
- నేడు భేటీ కానున్న ఇద్దరు నేతలు
- అలంపూర్ అసంతృప్తులపైనా మంత్రి నజర్
- నేడో, రేపో ఎమ్మెల్సీ చల్లాతో సమావేశం



మంత్రి హరీశ్‌రావుతో భేటీ అయిన బాలాజీసింగ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు తర్వాత పలు చోట్ల అసమ్మతి సెగలు రాజుకుంటున్న విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రధానంగా కల్వకుర్తి, అలంపూర్ సెగ్మెంట్లలో పార్టీ ప్రకటించిన అభ్యర్థులను మార్చాలని కోరుతూ అసంతృప్తులు మండలాల వారీగా సమావేశాలు పెడుతూ అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఈ మేరకు దృష్టి సారించిన బీఆర్ఎస్ అధిష్టానం నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరొందిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న పరిస్థితులపై పూర్తిస్థాయిలో ఆరా తీసిన ఆయన సంప్రదింపులకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

బాలాజీతో భేటీ..

కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ప్రకటించిన అనంతరం అసమ్మతులు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాలు (కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి) ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు మూడు (మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి) మండలాల్లో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఆధ్వర్యంలో అసమ్మతుల సమావేశాలు జరిగాయి. అభ్యర్థిని మార్చాలని.. లేకుంటే ఓడిపోతామని.. ఆయనకు సహకరించేదిలేదని బాహాటంగానే బాలాజీతో పాటు నాయకులు ముక్తకంఠంతో గళమెత్తారు. బీసీ కోటా అయితే తనకు లేదా చిత్తరంజన్‌దాస్‌కు అవకాశం ఇవ్వాలని.. లేకుంటే ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాలని బాలాజీ డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం వెల్దండ మండలంలో అసమ్మతి నేతల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంత్రి హరీశ్‌రావు కార్యాలయం నుంచి బాలాజీసింగ్‌తో పాటు ఇతర నాయకులకు పిలుపు వచ్చినట్లు తెలిసింది. దీంతో సదరు అసమ్మతి నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి హరీశ్‌ను కలిసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం హాజరు కాగా.. అసమ్మతి నాయకులతో ఇరువురు మాట్లాడి బుజ్జగించినట్లు సమాచారం.

పరిణామాలపై సుదీర్ఘ చర్చ

పార్టీ అధిష్టాన నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని.. అన్ని సమీకరణలను పరిగణనలోకి తీసుకునే సీఎం కేసీఆర్ అభ్యర్థులను ఎంపిక చేశారని.. మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమేనని.. మీకు సముచిత స్థానం కల్పిస్తామని అసమ్మతి నాయకులతో మంత్రి హరీశ్‌రావు అన్నట్లు తెలిసింది. తాము కేసీఆర్ నిర్ణయాన్ని వ్యతిరేకించడం లేదని.. కానీ పార్టీ అభ్యర్థి పట్ల ప్రజల్లో మంచి అభిప్రాయం లేదని.. ఓడిపోతామని.. పలు సమీకరణాలను మంత్రుల ఎదుట వారు వెల్లడించినట్లు సమాచారం. మరోసారి సమావేశమవుదామని, పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని హరీశ్‌రావు పునరుద్ఘాటించినట్లు పార్టీ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అంతేకాదు నియోజకవర్గంలో ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఓ నాయకుడికి సంబంధించిన అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది.

నేడు కసిరెడ్డితో.. త్వరలో చల్లాతో..

కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి మధ్య తీవ్ర విభేదాలు ఎప్పటినుంచో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈసారి అసెంబ్లీ టికెట్ తనకే వస్తుందని ఆశించిన కసిరెడ్డికి భంగపాటే ఎదురు కాగా.. అసంతృప్తితో ఉన్నారు. ఆయన వర్గానికి చెందిన వారే అసమ్మతి గళం వినిపిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మంత్రి కేటీఆర్ అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆయనను కలిసి ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. శనివారం కలుద్దామని హరీశ్‌రావు చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర ఆబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కసిరెడ్డి, అసమ్మతికి చెందిన ముఖ్య నాయకులతో ఆయన సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా అలంపూర్‌లో అసమ్మతి గళంపై దృష్టి సారించిన హరీశ్‌రావు త్వరలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో భేటీ కానున్నట్లు పార్టీ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కోనోకార్పస్ మొక్కల తొలగింపు

- బైపాస్ రహదారిపై పెద్ద ఈత చెట్ల ఏర్పాటుకు గుంతలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కోనోకార్పస్ మొక్కలతో శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరించడంతో పట్టణంలోని బైపాస్‌పై పెంచిన వాటిని తొలగిస్తున్నారు. వాస్తవానికి 2018లో ఈ రోడ్డు ప్రారంభం కాగా అనంతరం డివైడర్ మధ్య 5 కి.మీ. మేర సుమారు 1,700 కోనోకార్పస్ మొక్కలను నాటారు. వీటి నిర్వహణ బాధ్యతలను పాలమూరు మున్సిపాలిటీ చేపట్టింది. దీంతో ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు సిబ్బంది నీరు పోస్తున్నారు. ఇప్పటికే అవి 6 ఫీట్ల ఎత్తుకు పైగా పెరిగాయి. వీటితో పాటు ఇతర మొక్కలను సైతం దశల వారీగా బైపాస్‌కు ఇరువైపులా పెంచుతున్నారు. అయితే కోనోకార్పస్ మొక్కలతో శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఇటీవల వైద్య నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గత నెలలో వాటిని 3 ఫీట్ల మేర కొమ్మలను కత్తిరించారు. అలాగే సుమారు 500 మొక్కలను కొన్ని రోజుల క్రితమే తొలగించి జేసీబీలతో పెద్ద గుంతలు తవ్వారు. డివైడర్‌కు అటు, ఇటు రెండు వరుసలలో సైతం గోతులు తీస్తున్నారు. అక్కడి మట్టితో సహా ఈ మొక్కలను సమీపంలోని నర్సరీ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో డంపింగ్ చేశారు. ప్రస్తుతం అవి ఎండి పోయాయి. ఈ గుంతలలో పెద్ద ఈత చెట్లను నాటనున్నారు. గత నెల 26న కోటి వృక్షార్చనలో భాగంగా కొన్నింటిని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా అప్పట్లో అధికారుల అవగాహన లోపంతో వేలాది సంఖ్యలో ఈ మొక్కలను నాటి ఇప్పుడు తొలగిస్తుండటంతో మున్సిపాలిటీ నిధులు వృథా అయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో వివిధ చోట్ల గతంలో పెంచిన కోనోకార్పస్ మొక్కలను దశల వారీగా తొలగిస్తామన్నారు. ఇప్పటికే వాటి కొమ్మలను సగం వరకు కత్తిరింపజేశామన్నారు.



బైపాస్ డివైడర్ మధ్యలో తవ్విన పెద్ద గుంతలు

ప్రజల్లో భరోసా కల్పించడానికే ఫ్లాగ్ మార్చ్

మహబూబ్‌నగర్ క్రైం: రాబోయే ఎన్నికలు, వినాయక చవితి నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో టూటౌన్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రెండు స్టేషన్ల పోలీస్ సిబ్బందితోపాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) కలిసి ఫ్లాగ్ మార్చ్ తెలంగాణ చౌరస్తా నుంచి వన్‌టౌన్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడానికి, రాబోయే ఎన్నికలు, వివిధ పండగల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజల భద్రతపై భరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ చేపట్టినట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషిచేస్తున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వీకే యాదవ్, సీఐ సైదయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బిజినేపల్లి: పొలం వద్ద పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ఆంజనేయులు (35) పొలం దగ్గర వద్ద పురుగులమందు తాగి కింద పడిపోయాడు. చుట్టు పక్కల వారు గమనించి అతడిని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించా రు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంలో గురువారం రాత్రి మృతి చెందాడు. అతని భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతనికి భార్య, పాప, బాబు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రామాంజనేయులు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల మండలం కొండేరులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు కథనం ప్రకారం.. కొండేరుకు చెందిన రామాంజనేయులు (38) గత నెల 29న అదే గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ బైక్‌పై కొండేరు స్టేజీ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. కొండేరు స్టేజీ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా పెద్దదిన్నెకు చెందిన రాకేష్ బైక్‌పై ఎర్రవలికి వెళ్తూ వేగంగా ఢీకొట్టాడు. దీంతో రామాంజనేయులు తలకు బలమైన గాయమైంది. వెంకటేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు వెంటనే వారిని కర్నూల్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ రామాంజనేయులు శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


వనం రమేశ్ (ఫైల్)

తెలకపల్లి: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలం శుక్రవారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నారాయణ కథనం ప్రకారం.. మండలం లోని గౌరారానికి చెందిన వనం రమేశ్(29) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై గురువారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. అతని భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తమ్ముడిపై కత్తితో అన్నదాడి

వెల్దండ: మండల పరిధిలోని కొట్రలో తమ్ముడిపై అన్న కత్తితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొట్రకు చెందిన దేశమోని యాదగిరి, దేశమోని నరేష్ సొంత అన్నదమ్ములు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉండగా.. వీరి మధ్య మాటమాట పెరిగి ఘర్షన పడ్డారు. మద్యం మత్తులో ఉన్న యాదగిరి, తమ్ముడైన నరేష్‌పై ఐదు చోట్ల కొడవలితో దాడి చేశాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలియజేశారు.

జూరాల నుంచి 4,201 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 113 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కులు, కుడి కాల్వకు 698 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 80 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,201 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.004 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలం నీటిమట్టం 851.7 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 851.7 అడుగుల నీటిమట్టం, 83.9086 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 3,000, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 241, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,505, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 7.648 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 15,164 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

రికార్డు స్థాయిలో ఆదాయం



- రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీకి కాసుల వర్షం
- గురువారం రూ.1.99కోట్ల ఆదాయం
- మహబూబ్‌నగర్ డిపోకే అత్యధికం
- లక్ష్యానికి మించి ఈపీకే, ఓఆర్


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల సందడి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగ రోజు (ఈనెల 31న గురువారం) ఆర్టీసీ సంస్థకు మెరుగైన ఆదాయం వచ్చింది. పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా మహబూబ్‌నగర్ రీజియన్‌లోని డిపోల నుంచి 110 ప్రత్యేక బస్సులను నడిపారు. ముఖ్యంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్ రూట్లో ఎక్కువ బస్సులను నడిపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రీజియన్ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని నమోదు చేసింది.గత ఏడాది రాఖీ పండుగ రోజు రూ.1,81,46,707 ఆదాయాన్ని సాధిస్తే.. ఈ సారి అధికంగా రూ.1,99,48,886 ఆదాయాన్ని సొంతం చేసుకుంది. 31వ తేదీ రోజు డిపోలోని బస్సులు 3,59,391 కిలోమీటర్లు బస్సులు నడవగా ఈ ఆదాయం వచ్చింది. రోజువారీ ఆదాయం కంటే కంటే రికార్డు స్థాయిలో ఆదాయం రావడం విశేషం. పండుగ రోజు రీజియన్ 93.76 ఆక్యుపెన్సీ రేషియా (ఓఆర్) సాధించింది. ఎర్నింగ్స్ (ఆదాయం), వాల్యూం (కిలోమీటర్లు), ఈపీకే, ఓఆర్‌లో లక్ష్యాన్ని దాటడం విశేషం. డిపోల పరంగా మహబూబ్‌నగర్ డిపో రూ.30,23,895 వనపర్తి డిపో రూ.26,86,447, కల్వకుర్తి డిపో రూ.24,63,113 అధిక ఆదాయాన్ని పొందాయి.

డిపోల వారీగా 31న వచ్చిన ఆదాయం...

డిపో	తిరిగిన కిలోమీటర్లు	ఆదాయం (రూపాయల్లో)
మహబూబ్‌నగర్	53,867	30,23,895
వనపర్తి	46,599	26,86,447
కల్వకుర్తి	40,569	24,63,113
అచ్చంపేట	38,280	21,13,818
నారాయణపేట	37,979	20,89,176
షాద్‌నగర్	34,332	20,08,473
నాగర్‌కర్నూల్	36,063	19,71,372
గద్వాల	39,427	19,65,290
కొల్లాపూర్	27,005	13,87,479
కోస్గి	5,270	2,39,823

ఉద్యోగులను అభినందించిన ఆర్ఎం

రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు మెరుగైన సేవలు అందించి, మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోకు ఆయా రూట్లలో అధికంగా ఈపీకే తీసుకురావడంపై ఉద్యోగులను శుక్రవారం రీజినల్ మేనేజర్ శ్రీదేవి అభినందించారు. ఈ సందర్భంగా డిపోలో కార్యక్రమం నిర్వహించి ఉద్యోగులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి డిపోకు మరింత ఆదాయం తీసుకువచ్చేలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సూర్యనారాయణ, శ్యామల, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.


విజయ సంకేతం చూపిస్తున్న ఆర్ఎం, ఉద్యోగులు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, చండీహోమాలు


ఆలయంలో అర్చనలు చేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణ శుక్రవారం కలసి రావడంతో ఆలయంలో వారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగుళాంబ అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు జంభీరఫలార్చనలు, కుంకుమార్చనలు, త్రిశతి, ఖడ్గమాల అర్చనలు నిర్వహించగా.. యాగశాలలో భక్తులచే సామూహిక చండీహోమాలు నిర్వహించారు. అలాగే సంతాన స్వరూపిణి రేణుకా ఎల్లమ్మ వద్ద వంధ్యా (సంతాన భాగ్యం) స్త్రీలు సంతానం కోసం నవనీతం ఉపయోగిస్తూ సాంప్రదాయక పూజలు చేశారు. ఇక ప్రదోశ కాలంలో దర్బార్ సేవలతో పాటు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథోత్సవంలో ఆలయం చుట్టూ ప్రాకార ప్రదక్షిణలు చేయిస్తూ.. రథోత్సవ సేవలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మహా నివేదన సమయంలో ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటుగా బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో అన్నదానాలు, భోజన సౌకర్యం కల్పించారు. ఇక స్వామివారి ఆలయంలో ఏకవార రుద్రాభిషేకాలు, నవగ్రహ పూజలు చేశారు.


సోలార్ లైట్లు అందజేస్తున్న గ్రీన్ కంపెనీ యాజమాన్యం

సోలార్ లైట్లు సమర్పించిన గ్రీన్‌కో కంపెనీ

ఆలయ ప్రాంగాణంలో సూర్యకాంతి వెలుగులు నింపేందుకు గాను గ్రీన్ కో కంపెనీ వైస్ ప్రసిడెంట్ వేణుగోపాల్, రాంప్రసాద్ 11 సోలార్ లైట్లను అందజేశారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షల దాకా ఉంటుందని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలియజేశారు. అదే విధంగా ఆలయాన్ని గుల్బర్గ ఇంటలీజెన్స్ ఎస్పీ కిశోర్‌బాబు కూడా దర్శించుకున్నారు.

జాతీయ స్థాయికి మక్తల్ విద్యార్థులు

మక్తల్: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు మక్తల్ క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. మహ్మదాబాద్ తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారుల్లో మక్తల్ అయేషా, అభినవ్ దత్ ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, ఐలయ్యలు సమాచారం అందించినట్లు తెలిపారు. 12 మంది జాతీయ స్థాయిల్లో, ఇద్దరు ఆసియా షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొని ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ లో జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, తాన్‌సింగ్, అంబ్రేస్, రమేష్‌కుమార్, రూప, అబ్దుల్‌రావూఫ్, దామోదర్‌లు అభినందించారు.


జాతీయ స్థాయికి ఎంపికైన మక్తల్ విద్యార్థులు

నేటి నుంచి ఎండీసీఏ లీగ్



మహబూబ్‌నగర్‌లోని ఎండీసీఏ మైదానం

- అండర్-16 విభాగంలో 8 జట్లతో పోటీల నిర్వహణ
- నాలుగేళ్ల అనంతరం ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ఎండీసీఏ) లీగ్ శనివారం నుంచి ఈ నెల 24 వరకు కొనసాగనున్నాయి. స్థానిక పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో పోటీలు జరగనుండగా.. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు హెచ్‌సీఏ అంతర్ జిల్లా, తెలంగాణ టి-20 లీగ్‌లకు ఎంపికయ్యే అవకాశం ఉంది. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి.

అండర్-16 విభాగానికి 8 జట్లు..

ఎండీసీఏ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపికలను గత నెల 27న నిర్వహించారు. పోటీల్లో సుమారు 300కిపైగా క్రీడాకారులు పాల్గొనగా.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అండర్-16 విభాగంలో 8 జట్లుగా విభజించారు. ఈ జట్లకు శని, ఆదివారాలు 25 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

లీగ్‌లో పాల్గొనే జట్లు..

గ్రూప్-ఏలో ఎల్లో, గ్రీన్, పింక్, రెడ్.. గ్రూప్-బిలో ఆరెంజ్, పర్పుల్, బ్రౌన్, బ్లూ జట్లు పాల్గొంటున్నాయి. శనివారం ఉదయం 8.30 గంటలకు మొదటి మ్యాచ్ గ్రీన్, ఎల్లో జట్ల మధ్య జరగగా.. మధ్యాహ్నం ఒంటిగంటకు ఆరెంజ్, పర్పుల్ జట్లు తలపడనున్నాయి. 3న పింక్-రెడ్, బ్రౌన్-బ్లూ, 9న గ్రీన్-పింక్, ఆరెంజ్-బ్రౌన్, 10న ఎల్లో-రెడ్, పర్పుల్-బ్లూ, 16న గ్రీన్-రెడ్, ఆరెంజ్-బ్లూ, 17న ఎల్లో-పింక్, పర్పుల్-బ్రౌన్ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి. 23వ తేదీన ఉదయం 8.30 గంటలకు గ్రూప్-ఏ విన్నర్ జట్టు, గ్రూప్-బి విన్నర్ జట్టు మొదటి సెమీ ఫైనల్, మధ్యాహ్నం ఒంటిగంటకు గ్రూప్-ఏ రన్నర్ జట్టు, గ్రూప్-బి రన్నర్ జట్ల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్, 24న ఉదయం 8.30 గంటలకు ఎండీసీఏ లీగ్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

క్రీడాకారులకు వేదిక..



ఎండీసీఏ లీగ్ ఔత్సాహిక క్రీడాకారులకు వేదిక. గతంలో నిర్వహించిన పోటీలతో చాలామంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. ఈ లీగ్‌ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని వ్యక్తిగత ప్రదర్శనను మెరుగుపర్చుకోవాలి. లీగ్‌లో రాణించిన క్రీడాకారులను భవిష్యత్‌లో జరిగే అంతర్ జిల్లా, హెచ్‌సీఏ రాష్ట్ర టోర్నీలకు ఎంపిక చేస్తాం.

– ఎం.రాజశేఖర్, ప్రధానకార్యదర్శి, ఎండీసీఏ

ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీ


ఆర్మీ జవాన్ ఇంట్లో జరిగిన దొంగతనం తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో ఆర్మీ జవాన్ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగిన ఘటన చోటుచేసుకుంది.

ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. కానాయపల్లికి చెందిన ఆర్మీ జవాన్ నాగన్న ప్రస్తుతం రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య జయమ్మ రాఖీ పండుగ సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు పెద్దమందడి మండలం మనిగిళ్లకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న అరతులం బంగారం, రూ.40వేల నగదును దోచుకెళ్లారు. దీంతో ఇంటికొచ్చిన జయమ్మ ఇంట్లో చోరీ జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంను రప్పించి చోరీ జరిగిన చోట ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూత్పూర్ మండలం తలకొండపల్లిలో..

భూత్పూర్: ఇంటి తాళం విరగొట్టి బీరువాలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన గురువారం రాత్రి తాటికొండలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. తాటికొండకు చెందిన మూస సహదేవ్ గురువారం రాఖీ పండుగ సందర్భంగా అత్తగారి ఇళ్లైన వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం గట్టుకాడిపల్లెకు వెళ్లాడు. శుక్రవారం తిరిగి తాటికొండకు రాగా, ఇంటి తాళం విరగొట్టినట్లు కన్పించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు నాను, మూడు మాసాల కమ్మలు చోరీ చేసినట్లు గుర్తించాడు. మూసా సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేటి సమాజంలో ప్రతి విద్యార్థి చట్టంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు జేపీఎన్‌సీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రేరణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత చట్టాల గురించి తెలుసుకోవాలని, చట్టాలను గౌరవించాలన్నారు. వివిధ సంఘటనలు జరుగుతున్న క్రమంలో అవగాహన ద్వారా వాటిని చాలా వరకు నిరోధించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, ప్రిన్సిపాల్ సుజీవన్ లీగల్ సర్వీస్ సభ్యులు రాజేష్, కార్తిక్, యోగేశ్వర్ పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి

కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీరామకొండ క్షేత్రం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని శ్రీరామకొండ ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరామకొండ సందర్శించారు. ఈనెల6న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకులు రఘురామాచారి, రాఘవేందర్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య,, రాజవర్ధన్‌రెడ్డి, కుమ్మరిరాజు, లక్ష్మీనారాయణ, రాజుకుమార్, నాగేశం పాల్గొన్నారు.


శ్రీరామకొండను సందర్శించిన నాయకులు

పాలమూరు భారీ విజయం


జిల్లా క్రికెట్ జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

టూడే లీగ్‌లో 455 పరుగుల తేడాతో వెస్ట్ మారెడుపల్లిపై గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ టూ డే లీగ్ చాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లో పాలమూరు జిల్లా క్రికెట్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. వెస్ట్‌మారేడుపల్లి జరిగిన మ్యాచ్‌లో 455 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలిరోజు జిల్లా జట్టు 8 వికెట్లకు 637 పరుగులు చేసింది. శుక్రవారం రెండో రోజు వెస్ట్‌మారేడుపల్లి జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లును కోల్పోయింది. 47.4 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ పి.సాయికుమార్ 11.4 ఓ వర్లలో 42 పరుగులిచ్చి ఆరు వికెట్లు తీశాడు.

ఎండీసీఏ అభినందనలు

హెచ్‌సీఏ టూ డే లీగ్ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో లీగ్‌లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలుశిక్ష

జడ్చర్ల: భార్య ఆత్మహత్య కేసులో భర్తకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి పద్మావతి శుక్రవారం తీర్పు ఇచ్చారు. కోర్టు కానిస్టేబుల్ యాసిన్ కథనం మేరకు.. మండలంలోని ఆలూరుకు చెందిన గోపె మంగమ్మ 2019 ఫిబ్రవరి 20న ఇంటిలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె న్యాయమూర్తికి మరణ వాంగ్మూలం ఇచ్చింది. వరకట్నం కోసం తన భర్త గోపె చిన్న బాలయ్య వేధింపులు వల్లనే తాను ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు చెప్పి మృతి చెందింది. తదుపరి కోర్టులో విచారణ కొనసాగగా ఆమె భర్త గోపె చిన్న బాలయ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ముగ్గురు కేటుగాళ్లు అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న నాను

మిడ్జిల్: నకిలీ బంగారం ఇచ్చి బురిడి కొట్టించి అసలు బంగారం తీసుకెళ్లిన ముగ్గురు కేటుగాళ్లను అరెస్ట్ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో రెండు నెలల క్రితం పట్నం పద్మ, శంకర్ దంపతుల హోటల్‌కు ముగ్గురు వ్యక్తులు వచ్చారు. 15 రోజుల పాటు రెగ్యులర్‌గా హోటల్‌కు వెళ్లి వారితో స్నేహం పెంచుకున్నారు. కేఎల్ఐ కాల్వ పనులకు వచ్చామని మిడ్జిల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నట్లు నమ్మించారు. తమ వద్ద బంగారు ఉందని చెప్పి మొదట చిన్న బంగారు ముక్క ఇచ్చి పరిశీలించుకోవాలని చెప్పారు. దాన్ని పరిశీలించగా అసలు బంగారమని తేలింది. తమ వద్ద బంగారు బిళ్ల ఉందని సగం ధరకు ఇస్తామని చెప్పారు. దీన్ని నమ్మిన హోటల్ దంపతులు 3.15లక్షల నగదు, రెండున్నర తులాల బంగారు నాను వారికి ఇచ్చారు. దంపతులకు నకిలీ బంగారు ఇచ్చి వెళ్లిపోయారు. వారిచ్చిన వస్తువును ఔసలివాళ్ల వద్దకు తీసుకెళ్లి పరిశీలించగా నకిలీ బంగారంగా తేలింది. దీంతో తాము మోసపోయమని వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా రెండు రోజుల క్రితం మక్తల్‌లో అనుమానాస్పందగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని విచారించారు. మొదట తమ పేర్లు మార్చుకున్నారు. మొదటి వ్యక్తి వెంకట్‌రెడ్డి అలియాస్ తీర్థాల నాగేశ్వరావు, రెండో వ్యక్తి రాజు అలియస్ రాజేష్, మూడో వ్యక్తి అంజమ్మగా మార్చుకున్నారు. వారిని విచారించగా తమది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, వినుగొండ జిల్లా పల్నాడు గ్రామంగా ఒప్పుకోని నేరం అంగీకరించారు. వారి నుంచి రెండు లక్షల నగదు, రెండున్నర తులాల నాను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి


అర్హులకు గొర్రెలను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్: ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన గొర్రెలను రీ సెల్ చేస్తే చర్యలు తీసుకుంటామని.. వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మరికల్‌లో శుక్రవారం 23 యూనిట్ల గొర్రెలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్ల కురుమ యాదవులకు ప్రభుత్వం అందజేసిన గొర్రెలతో లబ్ధి పొందాలని సూచించారు. అలాగే మాదాసి ధ్రువీకరణ పత్రం కోసం ఆందోళన చేస్తున్న వారు గొర్రెల కోసం డీడీలు కట్టి ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. మాదాసి ధ్రువీకరణ కోసం పోరాటం చేయండని, దానిలో తప్పు లేదని ప్రభుత్వ పథకాలను దూరం చేసుకోవడంతో మీరే నష్టపోతారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, రవి, బసంత్, రాజేష్, తిరుపతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, రామస్వామి, గోపాల్, సుజాత, శేఖర్, కృష్ణయ్య, కొండప్పలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


భూత్పూర్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావుతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్

మక్తల్: శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చర్యలు తీసుకుంటామని.. ప్రజలకు రక్షణ, భద్రత కోరకే శాంతి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని భూత్పూర్‌లో రిజర్వ్ ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో ర్యాలీ నిర్వహించారు. రాబోయే పండుగలు, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు ప్రజలకు, రక్షణ, భద్రత భరోసా కల్పించడానికి వీధుల్లో కవాతు నిర్వహించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాహూల్, సిఐలు రాంలాల్, రాబిన్, బాబు, ఎస్ఐ పర్వతాలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ జాబ్ గ్యారంటీ 18-50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+ భోజనం. జీతం: 25000/-వేల వరకు. ఫోన్ : 8886738005 / 008

■ గ్రామీణ ప్రాంతాలలో ప్యూరిఫైడ్ వాటర్ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు సిబ్బంది కావలెను. అర్హత: ఎలక్ట్రీషియన్ / డిగ్రీ, స్థానిక జిల్లా వారికి ప్రాధాన్యత. ఫోన్ : 8143601441

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల ... పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్